
ప్రజాశక్తి



గురువారం 5 డిసెంబర్ 2024

పార్వతీపురం మన్యం

రక్షణ రంగంలో ఉద్యోగావకాశాలపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం

"ఇండియన్ ఎయిర్ ఫోర్స్" (సికింద్రాబాద్) ఆధ్వర్యంలో యువతకు "అగ్నిపత్" లో ఉద్యోగాలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై, 16 నుంచి 21 ఏళ్ల మధ్య వయసు కలిగిన యువతీ యువకులు ఈ సదస్సుకు హాజరు కావచ్చని తెలిపారు. ఈ నెల 6న సీతంపేట ఐటిడిఎ ఆడిటోరియంలోనూ, 7న పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 8న సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు జరుగుతుందని తెలిపారు. రక్షణ రంగంలో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వాటిలో పని చేయడం గొప్ప సంతృప్తిని ఇస్తుందని పేర్కొన్నారు. యువత సంబంధిత అవగాహన సదస్సులకు హాజరై తమతో పాటు తోటి విద్యార్థులకు తెలియజేసి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు.

6నుంచి రెవెన్యూ సదస్సులు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 6నుంచి జనవరి 8వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులకు అధికారులు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. సదస్సుల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ సదస్సులు 33 రోజుల పాటు జరుగుతుందని అన్నారు. గ్రామ సభ బృందంలో తహశీల్దార్, ఆర్ఐ, సంబంధిత గ్రామాల గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవాదాయ శాఖ మరియు వక్ఫ్ బోర్డు ప్రతినిధి (అవసరమైన చోట), రిజిస్ట్రేషన్ శాఖ ప్రతినిధి, అటవీ శాఖ ప్రతినిధి (అవసరమైన చోట) ఉంటారని వివరించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని, వాటికి వెంటనే రసీదు జారీ చేయాలని చెప్పారు. ఆన్‌లైన్ మాడ్యూల్‌లో అన్ని ఫిర్యాదులను నమోదు చేయాలని పేర్కొన్నారు. క్షేత్ర సందర్శనతో సహా ప్రతి ఫిర్యాదును సమగ్ర విచారణను నిర్వహించి, ఫిర్యాదులను పరిష్కరించాలని స్పష్టం చేశారు. గ్రామంలో రీ-సర్వే చేసి ఉంటే, కొత్తగా తయారు చేసిన ఆర్ఓఆర్‌ను గ్రామంలో చదివి, అభ్యంతరాలు ఏవైనా ఉంటే పరిశీలించాలని పేర్కొన్నారు. కోర్టు కేసులను, ముఖ్యంగా హైకోర్టు కేసులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, వ్యాజ్యం ఉన్న ప్రజానీకం తమ సమస్యలను తహశీల్దార్, ఆర్‌డిఒ పరిష్కారానికి అభ్యర్థించవచ్చని అన్నారు. తహశీల్దార్లు ఫిర్యాదుదారులు దాఖలు చేసిన అఫిడవిట్ కాపీని తీసుకోవాలని సూచించారు. వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి బృందం తగిన సూచనలు, సలహాలు అందించవచ్చని చెప్పారు. సరిహద్దు వివాదాలు ఉంటే, మండల సర్వేయర్‌ను నియమించి భూమిని సర్వే చేయడం ద్వారా పరిష్కరించవచ్చని ఆయన సూచించారు. ఫిర్యాదుల పరిష్కార స్థితిని రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. గ్రామసభ సమయంలో పిటిషన్లను నమోదు చేయడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి కంప్యూటర్‌లో నమోదు చేయాలని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించిన సమస్యలు వల్ల సంబంధిత వ్యక్తుల మనోవేదన తగ్గుతుందన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో అన్ని గ్రామసభలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల సమయంలో కనీసం 2 రోజుల ముందుగా గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే తేదీ, ప్రదేశాన్ని చాటింపు ద్వారా గ్రామస్తులకు తెలియజేయాలని, గ్రామ పంచాయతీ కార్యాలయం, పాఠశాల, గ్రామ సంస్థ కార్యాలయం (ఐకెపి), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదలైన ముఖ్యమైన ప్రదేశాలలోను సమాచారం ప్రదర్శించాలని ఆయన చెప్పారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకర్లు అందరికీ సదస్సుల షెడ్యూల్ ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల సమయంలో గ్రామాల్లో ప్రదర్శించడానికి వివిధ నిర్ణీత రంగుల్లో చిత్రీకరించిన ప్రభుత్వ భూములతో అన్ని గ్రామ మ్యాప్ కాపీలను సిద్ధం చేయాలని చెప్పారు. గత రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలు, విజ్ఞప్తుల వివరాలను, వాటిపై తీసుకున్న చర్యలను ప్రజలకు "చర్యలు తీసుకున్న నివేదిక" అందించడానికి సిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రత్యేక అధికారులు

రెవెన్యూ సదస్సులకు జిల్లా నోడల్ అధికారి కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మ చంద్రారెడ్డిని నియమించగా, నియోజక వర్గ ప్రత్యేక అధికారులుగా పార్వతీపురంకు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సాలూరుకు జిల్లా అటవీ శాఖ అధికారి జిఎపి ప్రసూన, పాలకొండకు సబ్‌కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, కురుపాంకు డ్వామా పిడి కె.రామచంద్రరావును నియమించారు.

మండల ప్రత్యేక అధికారులు

పాచిపెంట	వి.రాధా కృష్ణ, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి
బలిజిపేట	కె.రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి
గరుగుబిల్లి	ఒ .ప్రభాకరరావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఈఈ
మక్కువ	వి.తిరుపతయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి
పార్వతీపురం	ఎన్.రమేష్ రామన్ డిఎల్‌డిఒ
కొమరాడ	ఎ.రాజ శేఖర్ రెడ్డి, భూగర్భ జల శాఖ అధికారి
సీతానగరం	ఎం.వి కరుణాకర్, జిల్లా పరిశ్రమల అధికారి
సాలూరు	వై.సత్యం నాయుడు, డిఆర్ డిఎ పిడి
పాలకొండ	ఎస్ .మన్మధరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి
వీరఘట్టం	కె.సాయి కృష్ణ చైతన్య, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి
గుమ్మలక్ష్మీపురం	ఎం ఎన్ రాణి, ఐసీడీఎస్ పిడి
కురుపాం	కె.రామచంద్రరావు, డ్వామాపీడీ
సీతంపేట	ఎండి గయాజుద్దీన్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి
భామిని	ఎం.అన్నాదొర, సీతపేట గిరిజన సంక్షేమ శాఖ డిడి
జియ్యమ్మవలస	టి. కొండల రావు, డిపిఒ

మున్సిపల్ ప్రత్యేక అధికారులు

సాలూరు	డి.మంజుల వీణ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి
పార్వతీపురం	కె.రామకృష్ణారావు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్
పాలకొండ	ఎ. వి సల్మాన్ రాజు, జిల్లా పట్టు పరిశ్రమల అధికారి

విద్యాభివృద్ధే లక్ష్యం

- 7న మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు
- అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ
- ప్రత్యేక ప్రణాళిక రూపొందించిన ప్రభుత్వం

విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసేందుకు అవసరమైన సలహాలు సూచనలు, దాతల సహకారం కోసం ప్రభుత్వం ఈనెల 7న విద్యార్థులు, తల్లిదండ్రులతో మెగా సమావేశాలు నిర్వహించనుంది. నాణ్యమైన విద్యను అందించడం, కార్య సాధన, దూరదృష్టిని అలవాటు చేయడమే ధ్యేయంగా అన్ని ఉమ్మడి జిల్లాలోని (3284) ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. ఈ సమావేశాలల్లో సుమారు లక్షా 99వేల 296 మంది విద్యార్థులతో పాటు, వారి తల్లితండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, దాతలు పాల్గొంటారు.



ప్రజాశక్తి- పార్వతీపురం

విద్యార్థుల్లో సజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, సామాజిక బాధ్యతను అలవాటు చేయడం, స్ఫూర్తిని నింపడం, వారిలోని సాంస్కృతిక ప్రతిభను వెలికి తీసేవిధంగా ఈ సమావేశాలు నిర్వహిస్తారు. తమ సృజనాత్మకతను బట్టి విద్యార్థులే సొంతంగా ఆహ్వాన పత్రాలను రూపొందించి, తల్లితండ్రులను సమావేశాలకు ఆహ్వానిస్తారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ప్రజాప్రతినిధులను సైతం విద్యార్థులే ఆహ్వానిస్తారు. ఒక సమావేశానికి ఒక ప్రజాప్రతినిధిని మాత్రమే ముఖ్య అతిధిగా ఆహ్వానించ నున్నారు. పాఠశాలను అందంగా అలంకరిస్తారు. స్వాగత ద్వారాన్ని ఏర్పాటు చేస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారు. తల్లితండ్రుల్లో మహిళలకు రంగోళి, పురుషులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తారు. ఈ సమావేశాలను సమన్వయంతో, సజావుగా నిర్వహించేందుకు, వివిధ పనులను నిర్వహించేందుకు ప్రతీ పాఠశాల స్థాయిలో 12 రకాల కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీని కూడా ఏర్పాటయ్యింది.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో భాగంగా విద్యార్థులకు ముందుగానే ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, ఆరోజున పేరెంట్స్ హెల్త్ కార్డులను అందజేయనున్నారు. జిల్లాలో 3 నుంచి 19ఏళ్ల వయసు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించడానికి ప్రణాళికను రూపొందించారు. తొలిదశ క్రింద నియోజకవర్గానికి ఐదు విద్యాసంస్థలను ఎంపిక చేసి, సుమారు 5 వేల మంది చొప్పున జిల్లా వ్యాప్తంగా 35వేల మందికి వైద్య పరీక్షలను నిర్వహించి హెల్త్ కార్డులను సిద్ధం చేశారు.

40 రకాల వైద్య పరీక్షలు

పుట్టుకతో వచ్చే వ్యాధులు, వైకల్యాన్ని గుర్తించి, వాటికి సరైన చికిత్సను అందించడం ద్వారా వారు భవిష్యత్తులో ఇబ్బంది పడకుండా ఉండేందుకు అవసరమైన 40 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. 40 రకాల పరీక్షలను నిర్వహిస్తున్నారు. ముందుగా ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థుల ప్రాథమిక విరాలను సేకరిస్తారు. అవసరమైన వారిని పిహెచ్‌సి వైద్యులు, స్పెషలిస్టు వైద్యులు పరీక్షిస్తారు. వివరాలను వారికి ఇచ్చిన హెల్త్‌కార్డులు, బుక్స్, స్కూల్ హెల్త్ యాప్‌లో నమోదు చేస్తారు. దీనికోసం ఎఎన్ఎంల నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వరకు వివిధ స్థాయిల్లో శిక్షణ ఇచ్చారు.

అనారోగ్యంతో పసికందు మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/కురుపాం

అనారోగ్యంతో రెండునెలల పసి కందు మృతి చెందిన సంఘటన ఏజెన్సీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కురుపాం మండలం నీలకంఠాపురానికి చెందిన కొండగొర్రి అశోక్ కుమారుడు కొండ రోహిత్‌కు అనారోగ్యం వాటిల్లడంతో స్థానికంగా ఉన్న పిహెచ్‌లో వైద్యం అందించారు. అప్పటికీ నయం కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం అందించారు. కఫం, కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా తమ బిడ్డ చనిపోయాడని వైద్యులు తెలిపారని తండ్రి అశోక్ తెలిపారు. వైద్యులు చివరి వరకు మెరుగైన వైద్యమం దించినా తమ బిడ్డ బతకకపోవడంతో బాధగా ఉందన్నారు. చనిపోయిన తమ బిడ్డను గ్రామానికి తీసుకొచ్చేందుకు అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో మోటార్ సైకిల్‌పై తీసుకొచ్చామని అన్నారు.



మృతి చెందిన పసికందు రోహిత్



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ జెఎసి నాయకులు శ్రీనివాసరావు

9న శాంతియుత నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - సీతంపేట

సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల దీక్షలు చేస్తున్న గిరిజన గురుకులాల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు సంఘీభావంతంగా 9న శాంతయుత నిరసన ర్యాలీ సీతంపేటలో నిర్వహించనున్నట్టు ఆదివాసీ జెఎసి నాయకులు బి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకులాల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు గత 15 రోజులుగా ఐటిడిఎ గేటు వద్ద దీక్షలు చేస్తున్నా పాలకులు, అధికారుల నుంచి కనీస స్పందన లేకపోవడం దారుణమన్నారు. సీతంపేటలో హైస్కూల్ గ్రౌండ్ నుంచి ఐటిడిఎ వరకు నిరసన ర్యాలీ, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ జెఎసి నిరుద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ఉమామహేశ్వరరావు, రామ్మోహన్మోహన్‌రావు, ఉపాధ్యాయులు గణేష్, మోహనరావు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిస్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం: గిరిజన గురుకుల పాఠశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల, అధ్యాపకుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కోలక లక్ష్మణ మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఐటిడిఎ ఎదుట జరుగుతున్న దీక్షలకు వచ్చి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడంతోనే గురువులు పోరుబాట పట్టారని, ప్రభుత్వం అర్థం చేసుకోవాలని అన్నారు. కేబినెట్ మంత్రిగా గిరిజన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చొరవ చేసి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. వీరి పోరాటానికి అన్ని విధాలా అండ దండలు అందిస్తామని తెలిపారు. 15వ రోజు దీక్షల్లో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, శ్రామిక మహిళా సంఘం నాయకులు వాకాడ ఇందిర, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంఘం నాయకులు దివాకర్, వెంకట్, రాజేష్, రమేష్, కామేష్, జగదీష్, తిరుపతి నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బిల్లుల చెల్లింపులు భేష్

- రాష్ట్ర పౌరసరఫరాల ఎమ్‌డి మంజీర్ జిలానీ
- అంటిపేట,గుచ్చిమి రైతుసేవాకేంద్రాలు, ధాన్యం మిల్లు తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లాలో రైతులు నుంచి చేపడుతున్న ధాన్యం కొనుళ్లు, బిల్లుల చెల్లింపు భేషుగ్గా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల మేనేజింగ్ డైరెక్టర్ మంజీర్ జిలాని సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేపట్టారు. ముందుగా అంటిపేట రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు, తేమశాతం నమోదు, రైతులకు డబ్బుల చెల్లింపులు, ఇటీవల కురిసిన చిరుజల్లులకు, మబ్బులకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు, ధాన్యంసేకరణపై ప్రశ్నలు వేశారు. క్షేత్రస్థాయిలో రైతుల గుర్చి కూడా పలు ప్రశ్నలు వేశారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందా, అదనంగా ధాన్యం తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. రైతు సేవా కేంద్రాల సేవలపై కూడా ఆరా తీసి ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందా లేదన్న అంశాన్ని తెలుసుకున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు అనంతరం రైతులకు డబ్బులు చెల్లింపులు, తేమశాతం పైన రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో జరుగుతున్న విధానాలపై ఆయన సంతృప్తి చెందారు. 24 గంటల్లోగా డబ్బులు తమ ఖాతాలో జమ అవుతున్న విషయాన్ని రైతులు తమ సెల్‌ఫోన్లో మెసేజ్ ద్వారా చూపించారు. పక్కజిల్లాలో ఉండే ఫిర్యాదులపై ప్రశ్నించినప్పటికీ ఈ జిల్లాలో లేకపోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లు, ఇతర అధికారులంతా సమన్వయంతో పని చేస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్న జెసి ఎస్ఎస్ శోభిక వివరించారు. ఈ ఏడాది ధాన్యంలో రైతు నేరుగా మిల్లును కూడా ఎంచుకునే పద్ధతిని ఏర్పాటు చేయడం వల్ల మంచి ఫలితాలు ఇస్తుందని రైతులు తెలిపారు. మిల్లర్లు కూడా పూర్తి సహకారం అందిస్తామని, రూ.100 కోట్లు బ్యాంకు గ్యారంటీ కడతామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు డబ్బులు చెల్లింపులు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం సేకరణ తదితర అంశాల పట్ల ఎండి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాకు మొదటిసారిగా విచ్చేసిన ఎండి మంజీర్ జిలానీకు జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభికా, సబ్ కలెక్టర్ శ్రీ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా పౌర సరఫరాల అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారులు, మండల అధికారులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్, డిఎస్ఒ పి .శ్రీనివాసరావు, జిల్లా మార్క్ ఫెడ్ అధికారి వై.విమల, తహశీల్దార్ ఎ.ఉమా మహేశ్వరరావు, ఎఒ ఎస్.అవినాష్, సిఎస్‌డిటి రమేష్, అధికారులు, సచివాలయాల విఎఎలు, గ్రామ రెవిన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎండిని కలిసిన రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మండలంలోని తామరఖండిలో శ్రీవెంకట సూర్య మోడరన్ రైస్ మిల్లును సందర్శించిన సమయంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఘనస్వాగతం పలికి ఆయన్ను సన్మానించారు. తమ సమస్యలను పరిష్కరించాలని, 1:4 బ్యాంకు గ్యారంటీ సదుపాయాన్ని కల్పించాలని, గతంలో రావాల్సిన బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం కొనుగోలుకు పూర్తి సహకారం అందజేస్తామని, రూ.100 కోట్ల బ్యాంకు గ్యారెంటీ కూడా కడతామని మిల్లర్లు తెలిపారు.



జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాల ఎండికి వివరిస్తున్న జెసి శోభిక

రైతుతో ముఖాముఖి

మండలంలోని గుచ్చిమి రైతుసేవా కేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల మేనేజింగ్ డైరెక్టర్ మనజిర్ జిలాని సమూన్ తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలుపై ఆరా తీశారు. ఇదే సమయంలో అటువైపు వెళ్తున్న తాన్నసీతారాంపురానికి చెందిన రైతు మర్రాపు శ్రీరాములను ధాన్యం కొనుగోలుపై అడగడంతో పాటు డబ్బులు 24 గంటల్లోపు వచ్చాయా అని ప్రశ్నించారు. దీనికి రైతు తన సెల్‌ఫోన్ ను చూపించి తనకు ధాన్యం తరలించిన వెంటనే డబ్బులు బ్యాంకు ఖాతాలో జమైనట్లు వచ్చిన మెసేజ్ చూపించారు. అనంతరం పొలంలోకి నేరుగా వెళ్లి ధాన్యం నూరుస్తున్న రైతులతో మాట్లాడారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చివరి ధాన్యపు గింజ వరకు సక్రమంగా కొనుగోలుతో పాటు సకాలంలో డబ్బులు చెల్లింపులు చేస్తామన్నారు.

హామీలపై దృష్టి మరల్చడానికే డ్రామాలు

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై ప్రజల దృష్టి మరల్చేందుకే టిడిపి ప్రభుత్వం కొత్త కొత్త డ్రామాలను తెరపైకి తీసుకొస్తోందని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆరోపించారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడచిన ఐదు నెలల్లో ప్రజలు హామీలపై నిలదీస్తారనే భయంతో రకరకాల విన్యాసాలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, సమస్యలన్నింటికీ కారణం మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి అని ఆరోపించడం అర్థరహితమని చెప్పారు. ఇప్పుడు అధికారంలో ఉన్నది టిడిపి అన్నది మర్చిపోయి లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని చెప్పారు. 50 ఏళ్లకే బిసి, ఎస్సీ, ఎస్టీ లకు పింఛను అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. లక్షా 50వేల మంది ఫించన్లు తొలగించి కొత్త లబ్దిదారులకు పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం చూస్తోందని చెప్పారు. కాకినాడ పోర్ట్‌లో రేషన్ బియ్యం తరలింపునకు జగన్ మోహన్ రెడ్డికి ఏమిటి సంబంధమన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతే కానీ ప్రతిదానికి మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డే కారకుడని నిందించడం మాని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పరిపాలన చేతకాకపోతే తప్పుకోవాలని రాజన్నదొర డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు,వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మాజీ కౌన్సిలర్ లు పిరిడి రామకష్ణ పాల్గొన్నారు.



మహిళా కానిస్టేబుల్‌కు సూచనలు చేస్తున్న డిఐజి గోపీనాథ్ జెట్టి

చినమేరంగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఐజి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం చిన మేరంగి పోలీస్ స్టేషన్‌ను విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపినాథ్ జెట్టి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. ఈ ప్రాంతంలో క్రైమ్ రిపోర్ట్, శాంతి భద్రతల పరిరక్షణ వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంజాయి, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, పాలకొండ డిఎస్‌పి రాంబాబు, సిఐలు తిరుపతిరావు, హరి, ఎస్ఐలు అనీష్, నారాయణరావు ఉన్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతులు దినోత్సవ వేడుకలు సందర్భంగా గురువారం వికలాంగులకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు కె.కవిత తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కావున జిల్లాలో గల విభిన్న ప్రతిభావంతులంతా ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోటీల అనంతరం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో జరుగుతాయని తెలిపారు. జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.

రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -పాలకొండ

మండలంలోని తంపాటపల్లికి ఉపాధిహామీ నిధులతో బిటి రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొండ మండల, వీరఘట్టం మండల కూటమి నాయకులు మరియు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లపై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పి.ఆమిటి పంచాయతీ వంజరాపుగూడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.నిర్మల జ్యోతి ధాన్యం కొనుగోలు, రబీ సీజన్‌లో విత్తనాలు వాడకం, జీడి మామిడి ప్రాసెసింగ్ యూనిట్స్, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు తదితర విషయాలను చర్చించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్ ప్రసాదరావు, విఎఎ పావని ఉన్నారు.



ఆర్అండ్‌బి డిఇకి వినతిని అందజేస్తున్న సిపిఎం పట్టణ నాయకులు

ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రధాన రహదారిలో ఏర్పడిన గోతులను కప్పి మరమ్మతులు చేపట్టాలని రోడ్లు, భవనాలశాఖ డిప్యూటీ డిఇ టి.నిర్మలకు సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన రహదారిలో సిపిఎం బృందం పర్యటించి పరిశీలించింది. ఇందులో భాగంగా కొత్తవలస రైల్వేపై వంతెనపై, బైపాస్, రాయఘడ రోడ్లు, హనుమాన్ జంక్షన్, డంపింగ్ యార్డ్ వద్ద, ప్రధాన రహదారుల్లో గుంతలు, గొయ్యిలు ఏర్పడ్డాయని, దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వీటి మరమ్మతు పనులు చేయించాలని కోరారు. స్పందించిన డిఇ ప్రధాన రహదారిలో మరమ్మతు పనుల నిమిత్తం టెండర్ దశలో ఉందని, టెండర్ ఖరారైన వెంటనే మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు నియోజకవర్గ సమస్యలను వివరిస్తున్న వీరేష్

మంత్రికి వీరేష్‌చంద్రదేవ్ వినతి

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెం నాయుడును విజయవాడలో ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దీర్ఘకాలికమైన గుమ్మిడిగెడ్డ, వట్టిగెడ్డ మినీ రిజర్వాయర్ల నిర్మాణం పూర్తిచేస్తే కొన్ని వేల ఎకరాలకు సాగునీరందుతుందని తెలిపారు. అలాగే గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక వసతులైన విద్య, వైద్యం, తాగునీరు, రహదారి సౌకర్యాలు కల్పించి అభివృద్ధికి సహకరించి, జిల్లా పర్యటనకు రావాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.



స్వచ్ఛ సుందర పార్వతీపురంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

పట్టణాన్ని స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణాన్ని స్వచ్ఛ సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు అన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం పురస్కరించుకొని బుధవారం 26వ వార్డులోని బొగ్గుల వీధిలో ఆ వార్డు ప్రజలను భాగస్వామ్యం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కమిషనర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల వాతావరణంలో మార్పులు, ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని, కావున ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత సంచులను వినియోగించాలని కోరారు. అలాగే ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్త హానికరమైన చెత్తగా వేరుచేసి మున్సిపాలిటీ వారికి అందజేయాలన్నారు. అనంతరం ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఎస్ఒ వీరబాబు, సచివాలయ శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు, మేస్త్రీలు, సచివాలయ సెక్రెటరీలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో వెలసిన కోటదుర్గమ్మ వారి హుండీ ఆదాయం బుధవారం అధికారులు, బ్యాంక్ సిబ్బంది, ప్రజల సమక్షంలో లెక్కించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 19 నుంచి బుధవారం వరకు హుండీలు లెక్కించగా రూ.5,17,506 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

సర్వేను పరిశీలించిన ప్రత్యేక అధికారి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఎంఎస్ సర్వేను మండల ప్రత్యేక అధికారి కె.కరుణాకర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో ప్రతి కుటుంబాన్ని, ప్రతి సభ్యుణ్ణి ఆన్‌లైన్ పొందుపరచాలన్నారు. సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, ఇన్చార్జ్ ఇఒ రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ఎంపిడిఒ ఉమామహేశ్వరి

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

ఎస్ సొసైటీ ఆర్గనైజేషన్ అందిస్తున్న దుప్పట్లను పేద గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని వేగులవలస, వలసబల్లేరు, మిర్తివలస, మర్రిగూడ గిరిజన గ్రామాల్లో ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ పేదలకు అందజేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అలాంటి వారిని గుర్తించి దుప్పట్లను ఎస్‌సొసైటీ వారు అందజేయడం అభినందనీయమని, కావున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు క్రైస్, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట గ్రామ పంచాయతీ పరిధిలో గల న్యూ ఎస్టీ, న్యూ కాలనీ శివారు గల వాటర్ ట్యాంక్ మరమ్మతు పనులు జరుగుతుండడంతో పది రోజులు పాటు నీరు సరఫరాకు అంతరాయం కలుగుతుందని సర్పంచ్ ఎ.కళావతి, కార్యదర్శి వై.రామకృష్ణ తెలిపారు. ఈవిషయం సీతంపేట గ్రామస్తులు గమనించాలని కోరారు. గ్రామస్తులకు మంచినీటి ఇబ్బంది లేకుండా వంశధార డైరెక్ట్ పంపింగ్ స్కీమ్ ద్వారా తాగునీటిసరఫరా చేస్తామని తెలిపారు. కావున గ్రామస్తులు సహకరించాలని కోరారు.

ఐటిడిఎ ద్వారా చేప పిల్లలు పంపిణీ

ప్రజాశక్తి -భామిని

ఐటిడిఎ ద్వారా ఉచితంగా అందించిన చేప పిల్లలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు అన్నారు. మండలంలోని మణిగ, భామిని, బిల్లిడి పంచాయతీ పరిధిలోని 26 చెరువులకు ఎస్‌సిపి టూ టిఎస్‌పి నిధులతో 46,500 చేప పిల్లలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డిక ప్రసాద్, సర్పంచ్ లోపింటి రాజేష్, గురిబిల్లి లక్ష్మీపతి, సవలాపురపు రాజు, ఎపిడి శ్రీహరి, మత్స్యశాఖ సహాయకులు ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పరీక్ష

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థుల సమగ్ర అభివృద్ధి సామర్థ్యాన్ని పరీక్షించేందుకే జాతీయ విద్యా మిషన్ వారు నేషనల్ అచీవ్మెంట్ పరీక్షను నిర్వహించారని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ అన్నారు. బుధవారం నేషనల్ అచీవ్మెంట్ పరీక్ష జరిగిన పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 11 పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 3, 6, 9 తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి సామర్థ్యాలు పరీక్షించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపల్ సత్యవతి సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఇఒ సత్యనారాయణ

ఈ ఏడాదీ ఉత్సవ కమిటీతోనే జాతరా?

- ట్రస్టు బోర్డుకు నోటిఫికేషన్ ఇవ్వని ప్రభుత్వం
- సమీపిస్తున్న పోలమాంబ జాతర

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవతగా ఖ్యాతి గడించి మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర కృషితో గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రస్థాయి గిరిజన జాతరగా గుర్తింపు పొందిన శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఈ ఏడాది కూడా ఉత్సవ కమిటీతోనే నిర్వహణ జరిగేలా ఉంది ప్రస్తుత పరిస్థితులను బట్టి. ఈనెల 27న పెదపోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి తీసుకురావడంతోనే జాతర ప్రారంభమవుతుంది. అయితే జనవరి 27, 28, 29 తేదీల్లో ప్రధాన జాతర జరగనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ద్వారా ట్రస్టు బోర్డులు నియామకానికి పోలమాంబ ఆలయం గుర్తింపు ఏ విధమైన నోటిఫికేషన్ జారీ చేయలేదు. గత ఏడాది కూడా అప్పటి ప్రభుత్వం ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటుకు అవకాశం ఉన్నప్పటికీ కొన్ని రాజకీయాల నేపథ్యంలో ఉత్సవ కమిటీనే ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటు కాకపోవడంతో పలువురు కూటమి ప్రభుత్వం నుంచి ఆశావహుల ఆశలపై చల్లినట్లే అనిపిస్తోంది. ఈసారి జాతరకు అటు ట్రస్ట్ బోర్డ్ అయినా ఇటు ఉత్సవ కమిటీ అయినా 50శాతం మహిళలకు రిజర్వేషన్‌తో పాటు అర్చక, నాయి బ్రాహ్మణులకు చోటు కల్పించే ఆస్కారం ఉంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయి దేవాలయాల అన్నింటికీ వీటిని వర్తింప చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయం విదితమే. ప్రస్తుత పోలమాంబ జాతరకు సంబంధించి అర్చకుల నుంచి స్థానికంగా ఉండే వారికి ఉత్సవ కమిటీ లేదా ట్రస్ట్ బోర్డ్‌లో చోటు దాదాపు ఖరారైనట్లే. అలాగే నాయి బ్రాహ్మణుల విషయానికి వస్తే ఎవరికి చోటు కల్పిస్తారన్నది ప్రస్తుతం చర్చనీ అవసరం అవుతోంది. ఇదిలా ఉండగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తన మార్కు ఉండేలా ఉత్సవ కమిటీ లేదా ట్రస్టు బోర్డు ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయని ప్రచారం కూడా జోరం అందుకుంది. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఎదిగిన అమ్మవారి ధర్మకర్తల కమిటీల విషయంలో శంబర గ్రామానికి ప్రాధాన్యత ఆనవాయితీగా వస్తుంది. ఈసారి రాష్ట్రస్థాయి గుర్తింపు దక్కడంతో కొంత శాతం వరకు నియోజకవర్గంలో లేదా మండల స్థాయి వ్యక్తులకు చోటు కల్పించే ఆస్కారం కూడా లేకపోలేదని పలువురు భావిస్తున్నట్లు చర్చ నడుస్తోంది. ఎందుకేనంటే కూటమి ప్రభుత్వ రాజకీయ నిరుద్యోగతను నింపుకునేందుకు ఇక్కడ పదవులు దోహదపడతాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా పోలమాంబ అమ్మవారి ట్రస్ట్ బోర్డు చైర్మన్ లేదా ఉత్సవ కమిటీ అధ్యక్షుడి పదవుల కోసం శంబర గ్రామానికి చెందిన కొప్పల వెలమ, యాదవ సామాజిక వర్గానికి చెందిన ఓ ఇద్దరు పేర్లు కూటమి ప్రభుత్వం నియోజకవర్గస్థాయి నాయకులు పరిశీలన చేస్తున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. అయితే ఎవరికి వారు ఈ పదవుల కోసం పైరవీలు సాగిస్తున్నారు.



దుగ్గేరులో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దుగ్గేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర గిరిజన శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సందరానికి ఆర్‌సిఎస్ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ బుధవారం వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా మంత్రికి అందించిన వినతి పత్రంలో పార్వతీపురం ఐటిడిఎ ఏర్పడి 43 ఏళ్లలో అనేకసార్లు గిరిజనులు పోరాటాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని అన్నారు. నాన్ షెడ్యూల్ గ్రామాల్లోని గిరిజనులు తమ హక్కులు కోల్పోతున్నారని, 1/ 70 చట్టం, పీసా చట్టం వంటివి అమలు కాక తమ భూములను కోల్పోతున్నారని అన్నారు. అలాగే జీవో 3ను రద్దు చేయడం వల్ల చదువుకున్న గిరిజనులు ఉపాధిని కోల్పోతున్నారని, దీన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సాలూరు, ముక్కువ మండలాల్లో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను పెత్తందారులు లీజుల పేరుతో వందల ఎకరాలను ఆక్రమించుకుంటున్నారని ఇలా ఆక్రమించిన భూములను కనుగొని తిరిగి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అలాగే మార్కొండపుట్టి, శంబర పంచాయతీల్లో దళితులకు, పేదలకు ఇచ్చిన డిపట్టా భూములకు మళ్లీ రెవెన్యూ యంత్రాంగం తప్పుడు పట్టాలను సృష్టించి వేరొకరికి అవే భూపట్టాలను ఇచ్చి గొడవలు సృష్టిస్తున్నారని, వీరిపై కఠిన చర్యలు తీసుకొని భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, ఉపాధ్యక్షులు పీడిక అసిరి, మర్రి చెంచు వివిధ గ్రామాల నుంచి గిరిజనులు పాల్గొన్నారు.

కాలువ గట్టుపై పంటలు వేయడం అన్యాయం

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి ప్రధాన కాలువ గట్టుపై వివిధ రకాల పంటలు సాగు చేయడం దారుణం, ఈ విషయం తెలిసిన ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. జంఝావతి ప్రధాన కాలువపై అక్రమంగా పంటలు వేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, కాలువపై పంటలు సాగు చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని రాజ్యలక్ష్మీపురం నుంచి గరుగుబిల్లి మండలంలో కొన్ని గ్రామాల వరకు ఉన్న ప్రధాన కాలువ మొత్తం ఆక్రమణలకు గురవుతుందన్నారు. ఈ కాలుపై వరి, అరటి, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు వంటి పంటలు అక్కడక్కడ వేయడం వల్ల కాలువ గట్టు పూర్తిగా ధ్వంసమయ్యే పరిస్థితి ఉందని అన్నారు. ఈ విధంగా ప్రధాన కాల్వపై పంటలు కొంతమంది అక్రమంగా వేసుకొని ఆక్రమణకు గురవుతుంటే ఇరిగేషన్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే రాజ్యలక్ష్మీపురం నుంచి గరుగుబిల్లి మండలంలో కొన్ని గ్రామాల వరకు వెళ్తున్న ఈ కాల్వపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి అక్రమంగా పంటలు వేసిన, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి

ప్రజాశక్తి - కొమరాడ

పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని పరశురాంపురం, చంద్రంపేట గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. పరశురాంపురం వెల్నెస్ కేంద్రంలో నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఉపయోగించిన వ్యాక్సిన్ వయల్స్, వివిఎం స్థితి పరిశీలించారు. సకాలంలో పిల్లలకు టీకాలు వేస్తున్నారా అని టీకా కార్డుల్లో పరిశీలించారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల బరువు, ఎదుగుదల వివరాల రికార్డులు తనిఖీ చేశారు. తూనిక పరికరంతో పిల్లల బరువును పరిశీలించి రికార్డుల్లో నమోదు చేసిన నివేదికలతో సరిపోయినదీ, లేనిదీ గమనించారు. అంగన్వాడీ పిల్లల హెల్త్ స్క్రీనింగ్ ఏ మేరకు పూర్తి చేశారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లల్లో బరువు, పోషకాహారం లోపం గుర్తిస్తే ఎన్ఆర్సి కేంద్రంలో చేర్చాలన్నారు. పుట్టుక,ఎదుగుదల లోపాలు, దృష్టి, వినికిడి, స్పీచ్, ప్రతిభ లోపాలను గుర్తిస్తే డిఇఐసికి రిఫర్ చేయాలన్నారు. సీజనల్‌గా ప్రబలే శ్వాససంబంధిత రుగ్మతలు, జ్వరం, దగ్గు, లింఫ్ గ్రంధులవాపు, కామెర్ల లక్షణాలు గుర్తిస్తే జాప్యం చేయక సత్వరమే తగు చికిత్స అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రంలో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పిల్లలకు ఆహారం ఇచ్చే ముందు చేతులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవడం ఆవశ్యకమని అన్నారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. చేయాలన్నారు. అనంతరం గ్రామంలో తాగు నీటి స్వచ్ఛతా పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది లత, ప్రమీల, రామకృష్ణ, అంగన్వాడీ సిబ్బంది సావిత్రి,అనురాధ,ఆశ, సి హెచ్.డబ్ల్యూలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువును పరిశీలిస్తున్న జగన్మోహనరావు

వసతుల్లేని శిక్షణతో ప్రయోజనం ఎంత?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వసతి సౌకర్యం లేకుండా ఉచిత గిరిజన డిఎస్సీ శిక్షణ వల్ల గిరిజన అభ్యర్థులకు ప్రయోజనమేమిటని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శిక్షణలో కేవలం మధ్యాహ్నం భోజనం మాత్రమే పెట్టి వసతి సౌకర్యం లేకుండా కురుపాం, గుమ్మలక్ష్మీపురం, మక్కువ, సాలూరు, పాచిపెంట, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల గిరిజన ప్రాంత అభ్యర్థులు రాకపోకలు చేసి డిఎస్సీ పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కాగలరని రంజిత్‌కుమార్ అన్నారు. ప్రయాణానికే నాలుగు గంటలు పడుతుందని చెప్పారు. వసతి సౌకర్యంతో కూడిన శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కేవలం ఎస్‌జిటిలకు మాత్రమే శిక్షణ ఇస్తున్నారని, పాఠశాల సహాయకులు, భాషా పండితుల పోస్టులకు పోటీ పడే అభ్యర్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అలాగే శిక్షణకు కేవలం నలభై మంది మాత్రమే హాజరయ్యారని, అందులో సగం మంది మాత్రమే గిరిజన అభ్యర్థులని, వసతి సౌకర్యం లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వివరించారు. ఐటిడిఎ డబ్బులతో పాఠశాల విద్యా శాఖ వారు నిర్వహించడం ఎందుకన్నారు. శిక్షణ కోసం ఐటిడిఎలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇక్కడ అవకాశం లేకుండా పోయిందని అన్నారు. తక్షణమే మూడు పూటలా భోజనం, వసతి సౌకర్యాలతో పేద గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణ

వంద పని దినాలు కల్పించాలి

ప్రజాశక్తి -వీరఘట్టం

ప్రతి ఇంటికీ వందరోజులు పనిదినాలు కల్పించేందుకు చొరవ చూపాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ క్షేత్ర, సాంకేతిక సహాయకులను ఆదేశించారు. బుధవారం స్థానిక కంప్యూటర్ కార్యాలయంలో వీరితో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పల్లె పండుగ పనులు పూర్తి చేసేందుకు బాధ్యత వహించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. మినీ గోకులం నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు చొరవ చూపాలన్నారు. ప్రతి పంచాయతీ కార్యాలయంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టేందుకు బాధ్యత వహించాలని తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యంనాయుడు, ఇంజనీరింగ్ కన్సల్ట్ కష్ణ ప్రసాద్, సాంకేతిక క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులు ప్రదర్శిస్తున్న పలు విన్యాసాలు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కేదారిపురం ఫీడర్ పరిధిలో గల గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ట్రీ కటింగ్ పనులు చేయనుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎఇ రవికుమార్ తెలిపారు. ఈ అంతరాయానిన వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎక్సైజ్ శాఖ బుధవారం జరిపిన దాడుల్లో ఎర్ర సామంత వలస పరిధిలో 20 లీటర్ల నాటు సారాతో తాడంగి పాపయ్య అనే వ్యక్తి పట్టుబడినట్లు ఎక్సైజ్ సిఐ దాసు తెలిపారు. పాపయ్యను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. కేసు నమోదు చేసిన పాపయ్యను రిమాండ్ కు తరలించామని ఆయన తెలిపారు



కల్వర్టులో దిగబడ్డ లారీ

పట్టాలు పంపిణీ చేయాలి

.ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని బొర్రపనుకువలస, జిల్లేడువలస గిరిజనులకు అటవీ పట్టాలను ఇస్తామని గతంలో ప్రభుత్వం అధికారులు, పాలకులు చెప్పి నేటికీ కూడా వాటిని అమలుచేయలేదని, ఇచ్చిన హామీని అమలు చేసి, పట్టాలను ఇప్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు స్థానిక తహశీల్దార్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందర్రావు మాట్లాడుతూ గతంలో సర్వేలు చేసి పట్టాలు ఇస్తామని చెప్పిన అధికారులు ఇంతవరకు పట్టాలు పంపిణీ చేయకపోవడం దారుణమని అన్నారు. పట్టాలు ఇవ్వాలని గత రెండేళ్లుగా కోరుతూ స్థానిక అధికారులకు, జిల్లా అధికారులకు పలుమార్లు తెలియజేసినా నేటికీ అటవీ పట్టాలు పంపిణీ చేయకపోవడం సరికాదని తెలిపారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తక్షణమే అర్హులైన గిరిజనులకు పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గేమ్మెల నాగేశ్వరరావు, నర్సింగరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఘనంగా ఒకేషనల్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని అల్లూరి సీతారామరాజు వొకేషనల్ జూనియర్ కళాశాల 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజ్ఞాన విహార్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎ.నారాయణ స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఒకేషనల్ కళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు బయటకు వెళ్ళకుండా ఒకేషనల్ విద్యను చేరువ చేయడానికి ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అనుకూలంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించినసాంస్కృతిక కార్యక్రమాలు, అబ్బురపర్చే విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. బాగా చదివిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జనార్ధన్, ఎఎస్ఎస్ సంజీవ్ , ప్రిన్సిపల్ గోవిందరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన కల్వర్టు... తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కర్రివలస సమీపాన దశాబ్దాల క్రితం కొండ వాగుపై నిర్మించిన కల్వర్టు ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పెనుప్రమాదమే తప్పింది. వివరాల్లోకి వెళితే కర్రివలస నుంచి బస్ షెల్టర్ వరకు 250 మీటర్ల పొడవున రూ.10 లక్షలు మంజూరుతో సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డు పనులకు అవసరమైన డస్ట్ పౌడర్‌ను లారీతో కల్వర్టు మీదుగా తరలిస్తుండగా కొండ వాగుపై దశాబ్దాల కిందట నిర్మించిన కల్వర్టు ఒక్కసారిగా కూలింది. దీంతో లోడుతో ఉన్న లారీ తొట్టె కల్వర్టులో ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. జెసిబి సహాయంతో లారీని బయటకు తీసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పెదబుడ్డిడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు గురనా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండేలా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింగరావు, శశిభూషణ, పలువురు రైతు పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీల డేటా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

స్వర్ణ పంచాయతీల ఆన్లైన్ డేటాను 100శాతం పూర్తిచేయాలని డిఎల్‌పిఒ నాగభూషణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదబోగిలి మేజర్ పంచాయతీలో ఎక్కువ సిబ్బందిని కంప్యూటర్లను వినియోగించి సర్వే పూర్తి చేయాలన్నారు. మిగతా పంచాయతీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కొలతలు సరిచూడాలన్నారు. వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ త్రివిక్రమరావు, ఇన్చార్జి ఇఒపిఆర్‌డి భూషణ్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బహుళ పంటల విధానంతో మిత్ర పురుగుల అభివృద్ధి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో సుమారు 4 వేల ఎకరాల్లో పత్తి పండిస్తున్నారని, ఇదంతా కేవలం వర్షాధారంగా మాత్రమే పండిస్తున్నారని, అందువలన దిగుబడులు చాలా తక్కువగా వస్తున్నాయని రైతులు కొద్దిపాటి జాగ్రత్తలతో ఒకటే లేదా రెండు క్వింటాళ్ల దిగుబడి అధికంగా సాధించవచ్చని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని తురాయిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షధార పత్తి వల్ల పత్తి పెరుగుదల తక్కువగా ఉంటుందని, కావున అంతర్ పంటలుగా అపరాలైనా, చిరుధాన్యాలైనాత వేసుకోవాలని, పత్తి చుట్టూ ఒక వరుసలో ఆముదం, రెండు వరుసల్లో మొక్కజొన్న మధ్యలో నేలచిక్కుడు వేసుకోవడం ద్వారా కలుపు ఎక్కువగా మొలవకుండా ఉండడమే కాకుండా భూమిలోని తేమ శాతాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. అలాగే అదనపు ఆదాయంతో పాటు పత్తి నాణ్యత, దిగుబడి పెరుగుతాయని తెలిపారు. అంతర్ పంటలు బహుళ పంటల విధానంలో మిత్ర పురుగుల సంఖ్య పెరిగి పురుగు మందుల పిచికారీ ఆవశ్యకత తగ్గుతుందని అన్నారు. అలాగే ఎరపంటలు కంచి పంటలు వేయడం ద్వారా పురుగు ఉనికిని కనిపెట్టవచ్చని తెలిపారు. మొక్కజొన్నలో గడ్డి మందు పిచికారీ కంటే రెండుసార్లు గొప్పు తవ్వడం ఎంతో ఉత్తమమని అన్నారు. కలుపు మందులు నేల స్వభావాన్ని దెబ్బతీయడమే కాకుండా ఎరలను, ఇతర మిత్ర పురుగులను చంపేస్తాయని, కావున అంతర్ కృషి ద్వారా వేరు వ్యవస్థ దగ్గర గాలి బాగా సోకడంతో నాణ్యమైన మొక్కజొన్న దిగుబడులు సాధ్యమని తెలిపారు. అనంతరం టార్పలిన్లు, ఆయిల్ ఇంజన్లు, పవర్ వీడర్లు కావాలని రైతుల కోరారు. కార్యక్రమంలో సర్పంచి, ఎంపిటిసి, విఎఎలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పివిఆర్ పురం - తూడి గ్రామాల మధ్య ఎట్టకేలకు రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా రూ. 2కోట్లు అంచనా వ్యయంతో ఐటిడిఎ పర్యవేక్షణలో పనులు జోరుగా సాగుతున్నాయి. ఐదు విడతలుగా సిసి, బిటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత టిడిపి హయాంలో లో పివిఆర్ పురం నుండి తూడి, పివిఆర్ పురం నుండి డెప్పివలస వరకు రూ.4.5 కోట్లతో రోడ్డు పనులు చేపట్టారు. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంల్లోకి వచ్చిన తర్వాత పనులు చేపట్ట లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కార్యదర్శులతో మాట్లాడుతున్న డిఎల్ పిఒ నాగభూషణరావు